# విధి కాటేసింది

రచన :
శ్రీ ఎ. ఎం. అయోధ్యారెడ్డి.

కాశీపేట రైల్వేస్టేషన్:

కొద్దిసేపటిలో ఏదో రైలు వచ్చే సూచనగా సిగ్నల్ రెక్క వాలివుంది. ప్లాట్‌ఫారమ్ నిండా ఇసుక వేస్తే రాల నంతగా జనం నిలబడి రాబోయే ట్రైన్ కోసం ఆతృతగా నిరీక్షిస్తున్నారు.

మరో రెండు నిమిషాల్లో రైలుబండి రాక్షసుడిలా రంకె వేస్తూ దూరంగా నున్న మలుపు తిరిగి అందరి దృష్టి పథం లోకి వచ్చేసింది. చూస్తుండగానే తన భారీ శరీరాన్ని లాగు కుంటూ వచ్చిన రైలింజను పెద్దగా నిట్టూర్చి స్టేషన్‌లోకి వచ్చి ఆగింది. ఆగీ ఆగడంతోనే, జనం ప్రవాహంలా వచ్చి రైలును చుట్టేశారు. ఒకరినొకరు కుమ్ముకుంటూ త్రోసు కుంటూ ప్రయాణికులు రైలు పైకెగబడ్డారు.

కొంత సేపటి వరకు అక్కడ కూలీల అరుపులు, ప్రయాణికుల హడావిడి తప్ప మరింకేమీ విన్పించలేదు. మరి కాస్సేపట్లో రైల్లోని అన్ని కంపార్టుమెంట్లూ ప్రయాణికు లతో నిండిపోయాయి. అయినా ఇంకా సగం పైగానే క్రింద మిగిలిపోయారు జనం.

ఇంతలో రైలు కదలడానికి గంట కొట్టారు. మరు నిమిషంలో గార్డు విజిల్ వేసి పచ్చ జండా చూపాడు. అంత వరకు ఆయాసం తీర్చుకుంటున్నట్టుగా వుండిపోయిన రైలు ఇంజను భారంగా నిట్టూర్చి పొగలు గ్రక్కుతూ కదలడాని కుపక్రమించింది.

అదే సమయంలో చేతిలో చిన్న ట్రంకుపెట్టెతో హడా విడిగా పరిగెత్తుకొచ్చి చటుక్కున సెకెండ్ క్లాస్ పెట్టెలో ఎక్కాడు చంద్రం. అతనికి దాదాపుగా ఇరవై రెండు సంవ త్సరాలుండవచ్చు. కాని పరిశీలనగా చూస్తే అంత వయస్సు న్నట్లగుపించదు. అతి సామాన్యమైన పాంటూ, షర్టూ ధరించాడు. లేత మొహం, ఎర్రబడిన కళ్లు, చింపిరి జుట్టు గాలికి చిందర వందరగా నుదురును కప్పేస్తోంది.

అతని ముఖం అలసినట్టుగా వాడిపోయి వుంది.

చంద్రం ఎందుకో కంగారు పడుతూ, మెల్లమెల్లగా దూరమవుతున్న స్టేషన్‌లోని మనుషుల వంకా, వెనక్కి పోతున్న పరిసరాలవంకా నిశితంగా చూసి తర్వాత లోపలి కెళ్ళి ఖాళీగానున్న సీట్లో ఒక మూలగా, కిటికీ వద్ద ఆసీను డయ్యాడు.

క్రమంగా రైలు స్పీడందుకుంది. మరో రెండు నిమి షాల్లో స్టేషన్ వదలి చాలా దూరం వచ్చేసింది. అంత వరకూ ఊపిరి బిగపట్టినట్టుగా మూలగా నొదిగి కూర్చున్న చంద్రం తేలిగ్గా నిశ్వసించి తన సీట్లో సర్దుకొని కూర్చు న్నాడు. తర్వాత మెల్లగా తల యెత్తి పెట్టెలోని ప్రయాణి కులను తేరిపార జూశాడు,

ఆ కంపార్టుమెంట్లో ప్రయాణికులు నిండుగానే వున్నా త్రొక్కిడి మాత్రం లేదు.

చంద్రంకు దగ్గరగా ఎదుటి సీట్లో కూర్చుని ఒక యువతి వార పత్రిక తిరగేస్తోంది. ప్రక్కగా ఒక మూల మూడు పాతికలు దాటిన ముసలాయన దైవ కీర్తనలు కాబోలు గొంతెత్తి పాడుతున్నాడు. కిటికీలోంచి వచ్చే గాలి హోరుకు అవి సరిగా విన్పించక ఏదో గొణుక్కుంటునట్టుగా వుంది. మరో మూలగా కూర్చున్న ముగ్గురు వ్యక్తుల నడుమ నిరు ద్యోగ సమస్య తాలూకు చర్చ తీవ్రంగా కొనసాగుతోంది, వారికి ప్రక్కగా ఒక రైతు ప్రక్కతనితో ఆ సంవత్సరం అనావృష్టివల్ల పంటలు ఎలా నాశనమయ్యాయో విచారంగా వివరించి చెబుతున్నాడు. ఇంకా అక్కడక్కడ కొందరు రాత్రి తాలూకు నిద్రమబ్బుతో జోగుతున్నారు.

ఎదుటి సీట్లోని యువతి మాటిమాటికీ చంద్రం వైపు పరిశీలనగా చూసి చిన్నగా చిరునవ్వు చిందిస్తూ అంతలోకే చేతిలోని పత్రికలోకి చూపులు మళ్ళిస్తోంది. ఆ యువతి కట్టూ బొట్టూ నవ నాగరికంగా వుంది. ఆమె తనవైపు చూసి నవ్వి నప్పుడల్లా చంద్రం తొట్రు పడుతున్నాడు.

ఆ యువతిని రాసుకుంటూ ప్రక్కన కూర్చున్న ఇద్దరు కాలేజి విద్యార్థులు కాబోలు ఇదేం గమనించకుండా "జుగ్ను" చిత్రంలో ధర్మేంద్ర నటన గురించి బిగ్గరగా మాట్లాడుకుంటూ మధ్య మధ్య ఆ యువతివైపు వోర చూపులు విసురు తున్నారు,

మొత్తంమీద ఆ పెట్టెలోని ప్రయాణికులందరూ ఏదో ఒక వ్యాపకంలో లీనమై కాలాన్ని దొర్లిస్తున్నారు.

చంద్రం అందర్నీ ఓమారు చూడ్డం విరమించి తల తిప్పి కిటికీలోంచి బయటకు దృష్టి సారించాడు. బయట ప్రకృతి చాలా ఆహ్లాదకరంగా వుంది. రకరకాల వృక్షాలు అతి వేగంగా వెనక్కి పరిగెడుతున్నాయ్. అక్కడక్కడ పచ్చని

*There is Joy*

*Where There is !!*

HIGH PRESSURE WATER SYSTEM



Sugijo

DEEP WELL
PUMP SETS

JOTHI

ENGINEERING WORKS

INDUTRIAL ESTATE

MADURAI - 625007

ATHMAS

వరిచేలు చిరుగాలికి అందంగా తలలూపుతూ నాట్యం చేస్తున్నాయ్. చేలలో పనిజేయడానికి కూలి జనం అప్పుడే ఏవో జానపద గీతాలు ఆలాపన గావిస్తూ వస్తున్నారు.

బాల భాస్కరుని బంగారువన్నె లేత కిరణాలు పంట చేలమీద అందంగా ప్రతిబింబిస్తూ ప్రకృతి సౌందర్యానికి మరింత వన్నె చేకూరుస్తున్నాయ్.

సుందరమైన ఆ పకృతి సౌందర్యాన్ని తిలకించిన చంద్రం హృదయం కొంత తేలికైంది అయినా ఏ మూల నుండో అతని మనసు భారంగా నిశ్వసించింది. అతని కొక్కసారిగా తన యిల్లు గుర్తుకు వచ్చి కళ్లు చెమ్మగిల్లాయ్. 'ఎంత పని చేశాడు తను: కేవలం తన స్వార్థం కొరకు తన వాళ్ళందర్నీ నట్టేట ముంచాడు.' తను చేసిన పని అవివేక మైందని తెలియపరుస్తూ చంద్రం మనసు గతస్మృతుల్లోకి పయనించింది. అలాగే సీటులో జారగిలబడి గతంలోకి వెళ్ళిపోయారు.

* * *

చంద్రం తల్లిదండ్రులు లేని అభాగ్యుడు. చిన్న తనం నుంచి అతని అన్నా వదినలె తల్లిదండ్రులుగా అతన్ని పెంచి పెద్ద చేశారు. చంద్రం చిన్నప్పట్నించీ చాలా చురుకైన వాడు. ప్రతి క్లాసూ మంచి మార్కులతో ప్యాసవుతూ చివరకు బి. ఏ. కూడా ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుడయ్యాడు.

చంద్రం చదువు వెనకాల అన్నగారి ప్రోత్సాహం చాలా వుంది. శేఖరం చేస్తున్నది బడిపంతులు ఉద్యోగమైనా, అతనికి అరడజనుమంది రక్తం పంచుకు పుట్టిన పిల్లలున్నా ఎలాగో కష్టపడి చంద్రంను కూడా తన స్వంత కొడుకు లానే భావించి బి. ఏ. వరకు చదివించాడు.

ఆ రోజు-

బి. ఏ. పరీక్ష ఫలితాలు ప్రకటించబడ్డాయ్. చంద్రం ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. ఈ విషయం ఇంట్లో అందర్నీ ఆనంద సాగరంలో ముంచెత్తింది. అన్నయ్యా వదినల ఆనందమైతే ఇక చెప్పనలవికాదు.

ఆనాటిరాత్రి భోజనాల సమయంలో తనకు తెలిసిన ఒక ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం ఖాళీగా వుందనీ దానికి తాను ప్రయత్నిస్తాననీ, రేపే వెళ్ళి అప్లికేషన్ పెట్టుకోమని మెల్లగా చెప్పాడు శేఖరం.

ఆ మాటతో ఉలిక్కిపడ్డాడు చంద్రం. తాను కన్న కలలన్నీ భవిష్యత్తుమీద తాను పెంచుకున్న ఆశలన్నీ పటాపంచలవుతున్నందుకు అతని హృదయం అమితంగా ఘోషించింది. అతనికి పై చదువులు చదవాలని అంతర్గ

తంగా కోరిక బలీయంగా వుంది. తమ కుటుంబ పరిస్థితి అందు కనుకూలమైంది కాకపోయిననూ తనలో అంతర్లీనమైయున్న ఆ కోరికను మనసులోంచి నెట్టివేయలేక పోయాడు చంద్రం.

"గుమాస్తా ఉద్యోగం!" ఆ మాట అతని చెవిలో గింగురు మంటోంది. ఇక అతనికి భోజనం సహించలేదు.

"మాట్లాడవేంరా! రేపు వెళ్ళి అప్లికేషన్ పెట్టుకుంటావా!" తమ్ముని మౌనం చూసి రెట్టించాడు శేఖరం.

"క్షమించన్నయ్యా! నేనా ఉద్యోగం చేయలేను నాకు ఎమ్. ఏ. చదవాలని వుంది." అతికష్టంమీద కంఠం పెకల్చుకొని అన్నాడు చంద్రం.

ఆ మాటలకు శేఖరం తమ్ముని వైపు జూపి ఉదాసీనంగా నవ్వాడు అతనికి తెల్సు చదివిస్తే చంద్రం ఇంకా అభివృద్ధిలోకి వస్తాడని. "ఎలారా! నీకు తెలియంది కాదుకా మన కుటుంబ పరిస్థితి ఎలాంటిదో!" తమ్ముని జాలిగా చూస్తూ అన్నాడు.

"ఎంత కష్టమైనా సరే! నేను చదువుకుంటానన్నయ్యా!" చంద్రం మాటల్లో దృఢమైన పట్టుదల కన్పించింది.

శేఖరం భోజనం ముగించి లేచాడు. చేతులు కడుక్కొని తడిచేతుల్ని భుజంమీది తుండు గుడ్డతో తుడుచుకుంటూ అన్నాడు.

"చూడు చంద్రం! చదువుకోవాలనే నీ అభిలాష ప్రశంసించ దగ్గదే! నువ్వు చదువుకొని పైకి వస్తే చూసి ఆనందించాలని మాకూ వుంది. కాని నిన్ను ఎం.ఎ. చదివించేంత తాహతు నాకు లేదు. ఉన్న ఒక్క ఎకరం భూమి చెల్లెలు సరోజ పెళ్ళికోసం నీ ఇష్టంమీదనే అమ్మేశాను. డబ్బు మొత్తం ఐదువేలు రేపు నిశ్చితార్థం రోజు పెళ్ళివారి కందజేయాలి. ఇటువంటి పరిస్థితిలో నువ్వు చదువుకోవడం భావ్యం కాదని నా అభిప్రాయం. బాగా ఆలోచించు. ఆ పైన నీ ఇష్టం!" అలా అని బయటకు వెళ్ళిపోయాడు శేఖరం.

అన్నగారి మాటల వెనకాల వున్న స్థిరత్వాన్ని గ్రహించిన చంద్రం హతాషుడైపోయాడు. ఇక ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. భవిష్యత్తుపై అతడుకన్న రంగు రంగుల స్వప్నాలన్నీ ఆదిలోనే కరిగిపోవడం సహించలేక పోతున్నాడు. పై చదువులు చదవాలనే కోరికను ఎంతగా అణిచిపెడతామన్నా అతనికి సాధ్యంకావడంలేదు. నిస్పృహగా పక్కమీద అటూ ఇటూ దొర్లాడు.

"సరోజ పెళ్ళికని పొలం అమ్మి తెచ్చిన ఐదువేలు తీసికొని పారిపోతే! తానెక్కడైనా హాయిగా చదువుకోవచ్చు" చటుక్కున చంద్రం మదిలో ఈ యోచన మెరిసింది. మరు క్షణం అతని ఆలోచన అంతరంగంలో ఘర్షణ రేపింది.

"తానా ఐదువేలు తీసికొని పారిపోతే ఇంకేమైనా ఉందా అన్నయ్యా వదినలు దిగులుతో కృంగిపోతారు. సరోజ తన పెళ్ళి తప్పిపోయినందుకు ఏదైనా అఘాయిత్యానికి సిద్ధపడవచ్చు!" తిరిగి అతనిలో ఏదో తెలియని విర్లిప్తత ఆవహించింది. అతని మేధస్సులోకి వెనువెంటనే మరో ఆలోచన వచ్చింది. "తాసీ డబ్బుతో యూనివర్శిటీ ఫీజు చెల్లించి, బట్టలు వగైరాలు కుట్టించుకుంటే చాలు. ఆ తర్వాత ప్రభుత్వం తనకు తప్పకుండా స్కాలర్‌షిప్ నిస్తుంది. మహా అయితే తన చదువు రెండేళ్ళు అంతేగా! ఎం. ఎ పూర్తి చేస్తే తన కెట్లాగూ ఉద్యోగం దొరుకుతుంది. ఈ లోగా అన్నయ్యను దిగులుపడవద్దని ఉత్తరం వ్రాసే సరిపోతుంది.

చంద్రాన్ని ఏదో మొండి పట్టుదల వెన్నుతట్టింది. చివరకు తన భవిష్యత్తును గూర్చిన వ్యామోహంతో ఇంట్లోంచిడబ్బు తస్కరించడానికే నిశ్చయించుకున్నాడు.

ఆ రోజు పొలం అమ్మిన డబ్బు అన్నయ్యతెచ్చి వదిన చేతికిచ్చాడు జాగ్రత్త చేయమని. ఆమె దాన్ని ఎక్కడ దాచిందో తనకు తెల్సు, దేవుని గదిలో వేంకటేశ్వరుని విగ్రహం చాటున చిన్న చెక్కపెట్టిలో వుందా డబ్బు.



# ఎలెన్ మోటార్లు మరియు పంపులు

ELLEN

ఆంధ్రప్రభుత్వముచే అధికారము పొందియున్నది.



*Manufacturers of:*

Single Phase Motors. 3 Phase Motors. Centrifugal Pumps, Domestic Pumps. Domestic Mono Blocks and Jet Pumps, Jet Mono Blocks.




For Particulars

**ELLEN INDUSTRIES**

Peelamedu : : Coimbatore - 641004

…………………: బ్రాంచి: …………………

ఎలెన్ ఇండస్ట్రీస్

7-8-177, ఘష్‌మండి

సికిందరాబాదు-3 (ఎ.పి.)


కర్తవ్యం భుజం తట్టగా కార్యదీక్షతో లేచాడు చంద్రం.

చప్పుడు కాకుండా గదిలో ప్రవేశించి డబ్బు తీసికున్నాడు చంద్రం. బయటకు వస్తూ ఒక్కసారి అన్నా వదినల వైపు చూశాడు.

నిత్య జీవిత పోరాటంలో అలసిపోయి గాఢ నిద్రా పరవశులైన ఆ దంపతుల వదనాలు నిర్మలంగా వున్నాయ్. భావి జీవితపు బంగారు కలల్లో తొంగి చూస్తోంది కాబోలు సరోజ. ఆ మధుర స్మృతుల తాలూకు చిరునవ్వు పెదవుల మీద మెరుస్తోంది. ఇవేవి చంద్రం పట్టుదలను అరికట్టలేక పోయాయ్.

ఐదువేల రూపాయలతోనూ, తన బట్టలు పుస్తకాలు, సర్టిఫికెట్లుగల పెట్టెతోనూ రాత్రికి రాత్రే బయలుదేరి రెండు మైళ్ళ దూరం నడిచి స్టేషన్ చేరుకున్నాడు చంద్రం. తెల్లవారేంత వరకూ తన్ను ఎవ్వరు చూడకుండా జాగ్రత్తగా స్టేషన్‌లో గడిపి ఉదయం ఏడు గంటల ట్రైన్ ఎక్కాడతను.

*　　　*　　　*

గతమంతా ఒక్కసారి చంద్రం కళ్ళముందు గిర్రున తిరిగి ఒక్క క్షణం అతన్ని వివశుణ్ణి చేసింది. అతని హృదయం మూగగా ఘూర్ణిల్లింది. ఛుక్....ఛుక్ మంటూ రైలుబండి చేస్తున్న లయబద్ధమైన చప్పుడు అతన్ని జోకొట్టినట్టుగా అన్పించి క్రమంగా నిద్రాదేవత వాడిలో వొరిగి పోయాడు చంద్రం.

*　　　*　　　*

అలా ఎంతసేపు పడుకున్నాడో అతనికే తెలియదు. అకస్మాత్తుగా భుజం మీద చేయివేసి ఎవరో కుదిపినట్లయి చటుక్కున కళ్ళు తెరిచాడు చంద్రం.

"టికెట్ ప్లీజ్!"

గంభీరంగా, అధికారస్వరంతో అడుగుతూ నిలబడియున్న టికెట్ కలెక్టర్ ఎదురుగా కన్పించాడు చంద్రానికి.

పూర్తిగా మేలుకున్న చంద్రం ఆత్రంగా టికెట్ కోసం జేబులో చేయి దూర్చాడు అంతే!

ఒక్కసారిగా అదిరిపడ్డాడు. అతని నవనాడులు కృంగిపోయాయ్. ప్రపంచం అకస్మాత్తుగా తల క్రిందులై తానెక్కిన రైలు అగాధంలోకి పడిపోతున్నట్లుగా ఫీలయ్యాడు.

కాన్పేపటి వరకతనికి కత్తిరించబడిన తన జేబు మినహా ఏమీ అగుపించలేదు. సీటు క్రిందికి కంగారుగా పెట్టెకోసం చూశాడు. అదీ లేదు.

చంద్రం ముఖంలో రక్తం ఒక్కసారిగా ఇంకి తెల్లగా పాలిపోయింది.

"సార్! నా జేబు....నెవరో కత్తిరించారు. నా డబ్బు ....నా పెట్టె....అన్నీ...పోయాయి సార్!!" కంపిస్తున్న గొంతుకతో అరిచాడు.

ఒక్కసారిగా కంపార్టుమెంట్లో కలకలం చెలరేగింది. కంగారుగా ఎవరి సామానులు వాళ్ల జాగ్రత్తగా వున్నాయో లేదో చూచుకుంటున్నారు. అంతా గందరగోళం.

టి. సి. విసుగ్గా నుదురు చిట్లించాడు "మిస్టర్! వెధవ్వేషాలు మాని ముందు టికెట్ చూపించు. టికెట్ లేకుండా ప్రయాణం చేసింది చాలక ఇదో నాటకం"

కటువుగా అన్న టి. సి. మాటలకు దీనంగా తలెత్తి పెట్టెలోకి చూశాడు చంద్రం. కంపార్టుమెంటు మొత్తం మీద తానంత క్రితం చూసిన ఒక్క ముఖం కన్పించలేదతనికి. అంతా క్రొత్తవారు. ఎవర్ని అడగడానికీ వీలు లేకపోయింది. ఏడుద్దామన్నా శక్తి లేకుండా పోయింది చంద్రంలో.

"సార్! నా మాట నమ్మండి సార్! నేను టికెట్టు కొన్నాను. నా వద్ద ఇంకా ఐదువేల రూపాయలు కూడా వుండేవి సార్! నా డబ్బు. నా పెట్టె అన్నీ పోయాయి. జేబు నెవరో కత్తిరించారు. కావాలంటే ఇదిగో చూడండి సార్!!" ఈ మాట అతికష్టంగా అంటూ ఏడ్చేశాడు చంద్రం.

చంద్రం మాటలకు టి. సి. హేళనగా నవ్వాడు. "నీ వెధవముఖానికి తోడు ఐదువేల రూపాయలు కూడానా? నీ లాంటి దొంగముఖాలను వూరికే వదలకూడదు నడు స్టేషన్‌కి" హూంకరిస్తూ మెడపైన చెయ్యివేసి ముందుకు త్రోశాడు.

అంతలోనే రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. పెట్టెలోని ప్రయాణీకుల్లో కొంతమంది గడబిడగా దిగిపోయారు. ఎవ్వరూ చంద్రం విషయంలో ఇదేమని ముందుకు రాలేదు.

"ఊఁ! ఇంకా చూస్తావేం? నడవరా ఫూల్!!" చంద్రం చెబుతున్న మాటలేవీ విన్పించుకోకుండా టి. సి. అతన్ని బయటికి లాక్కుపోయాడు.

"ఛీ ఛీ! ఇటువంటి చీడపురుగులున్నంత కాలం మన రైల్వే డిపార్టుమెంటు బాగుపడదు. ఏకీలు కాకీలు విరిచి పారెయ్యాలి దొంగ వెధవలను" ఒక పెద్దమనిషి గాండ్రించి కిటికీ గుండా ఉమ్మేస్తూ కోపంగా అన్నాడు.

"అంతా కలికాలం! ఈ రోజుల్లో ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో తెలియడంలేదు." ఊడిపోతున్న జుట్టు ముడి వేసుకుంటూ అన్నాడొక వేదాంతి.

"వాడి ముఖం చూసి నేను ముందే ఊహించాను. ఈ రంగంలో అందె వేసిన చెయ్యి అని డర్టీ క్రీచర్!" మాటల్లోని కసినంతా ముఖంలో చూపిస్తూ అసహ్యించుకున్నాడో సూట్‌వాలా.

రకరకాల వ్యాఖ్యానాలు వింటూ దైన్యానికి మారుపేరులా టి. సి. వెంట దిగాడు చంద్రం. స్టేషన్‌లోనున్న పోలీసులను పిల్చి చంద్రాన్ని అప్పగించి వారితో ఏదో చెప్పి టి. సి. వెళ్ళిపోయాడు.

చంద్రం నిర్జీవంగా శూన్యంలోకి చూస్తున్నాడు. తన్ను ఘోరంగా కాటేసిన విధిని తలచుకున్నాడు.

అతని జ్ఞాపకాల తెరలమీద వరుసగా అన్నయ్యా,వదినా, సరోజా సాక్షాత్కరింపసాగారు.

"ఇంకా నిలబడతావేంరా గాడిద కొడకా! పద!!" అన్న పోలీసు ఘర్జనతోపాటు వీపులో బలంగా పడిన లాఠీ దెబ్బకు ఉలిక్కిపడుతూ ముందుకు అడుగు వేశాడు చంద్రం.


కథాంజలి

(కథల మాసపత్రిక)

స్థాపితం : 1938

విడి ప్రతి...0-30 పైసలు

సం॥ చందా : 6-00 రూ.

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్

బుక్‌స్టాల్సులోనూ దొరుకును